సాక్షి ములుగు

బుధవారం । 29 । మార్చి । 2023



ఏనుమాములలో వారిదే హవా
ఏనుమాముల ప్రాంతంలో దశాబ్దాల క్రితం కొన్న ప్లాట్లు పెద్ద సంఖ్యల్లో ఉండడంతో రెండు, మూడు గ్యాంగ్‌లుగా ఏర్పడి కొందరు కబ్జాలకు తెరలేపారు. - 8లో▸



విద్యారంగానికి ప్రాధాన్యం
రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం $36^0/24^0$
జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన ఎండ ఉంటుంది. పొడి వాతావరణంతో పాటు రాత్రిపూట చల్లగా ఉంటుంది.



న్యూస్‌రీల్

నేటి నుంచి శ్రీరామ నవమి ఉత్సవాలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయం అనుబంధ దేవాలయం శ్రీరామాలయంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని బుధవారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. బుధవారం రాత్రి 8గంటలకు స్వామివారి ఎదురుకోలు సేవ కార్యక్రమం నిర్వహిస్తారు. గురువారం శ్రీరామ నవమి సందర్భంగా ఉదయం 10.05గంటలకు శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఈఓ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

129 మంది విద్యార్థులు గైర్హాజరు

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షకు 129 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి దేవరాజం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నిర్వహించిన రసాయనశాస్త్రం, వాణిజ్యశాస్త్రం, ఒకేషనల్ పేపర్ పరీక్షలకు 1,776 మంది విద్యార్థులకు గాను 1,647 హాజరైనట్లు వివరించారు.

ఆజాంనగర్‌లో పోషణ్ పక్వాడా..



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండల పరిధిలోని ఆజాంనగర్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ అధ్వర్యంలో మంగళవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి హాజరై ఆహారం, అలవాట్లు, చిరుధాన్యాల ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులకు రక్త పరీక్షలు చేయించి రక్తహీనతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోవిందుల రాజమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, స్వప్న, రవళి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ప్రత్యేక సెల్

భూపాలపల్లి: ఉద్యోగార్థులు ధ్రువపత్రాలు పొందే విషయంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ భవేష్ మిశ్రా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే సివిల్ సర్వీసెస్(ప్రిలిమినరీ) పరీక్షలు రాయబోయే ఓబీసీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు(ఈడబ్ల్యూఎస్), ఎస్సీ, ఎస్టీ వర్గాల వారు ధ్రువపత్రాలు పొందేందుకు ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. లేదా సీ సెక్షన్ సూపరింటెండెంట్‌ని నేరుగా గాని ఫోన్ నంబర్ 7995005022లో గాని సంప్రదించాలని పేర్కొన్నారు. ఫిర్యాదులను వెంటనే పరిశీలించి సకాలంలో సర్టిఫికెట్లు అందిస్తామని కలెక్టర్ వెల్లడించారు.

గడువు పెంచాలి

చిట్యాల: ఆయుష్మాన్ భారత్ పథకంలో పేర్ల నమోదు గడువు ఈ నెల 31 తో ముగుస్తున్నందున చాలా మంది పేద ప్రజలు ఇంకా నమోదు చేసుకోలేదని గడువు పెంచాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పుల్ల మల్లయ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రేషన్‌కార్డు లేని వారికి కూడా ప్రభుత్వం ఆధార్ కార్డుతో పథకం వర్తింపజేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కూడా రేషన్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ రూ.5లక్షల వరకు వైద్య చికిత్సలు అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కనకం రాములు, గిన్నారపు ఓదేలు పాల్గొన్నారు.

బడ్జెట్ @ రూ.389కోట్లు

అలరించిన కవి సమ్మేళనం

'విద్యార్థి ఉద్యమకారుల సభ'కు అనుమతి నిరాకరణ

- వివరాలు 10లో▸

ఎక్సైజ్ దూకుడు

నిబంధనలు ఉల్లంఘిస్తున్న వైన్స్‌లపై కొరడా

- 16 నెలల్లో 22 షాపులపై చర్యలు
- అధిక ధర, మద్యంలో నీళ్లు కలపడం, రిజిస్టర్లు సక్రమంగా రాయకపోవడమే కారణం
- విచ్చలవిడిగా బెల్టుషాపులకు సరఫరా



ఈ నెల 16న సీజ్ చేసిన టేకుమట్లలోని వైన్‌షాపు

భూపాలపల్లి: నిబంధనలు ఉల్లంఘిస్తున్న వైన్‌షాపు యజమానులపై ఎక్సైజ్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. అధిక ధరలకు మద్యాన్ని విక్రయించడం, రిజిస్టర్లు సరిగా రాయని, ఒక షాపులోని మద్యాన్ని మరోషాపులో విక్రయిస్తున్న వైన్స్‌పై చర్యలు తీసుకుంటున్నారు. అయినప్పటికీ పలు వైన్స్ యజమానులు తమ దందాను వీడటం లేదు.

జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో 60 వైన్‌షాపులు ఉన్నాయి. 2021 డిసెంబర్–2023 నవంబర్ కాల పరిమితితో ఈ షాపులు నడుస్తున్నాయి. అయితే ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వైన్ షాపులపై ఎక్సైజ్ అధికారులు తీవ్రంగా చర్యలు తీసుకుంటున్నారు. స్థానిక ఎక్సైజ్ అధికారులు, స్టేట్ టాస్క్‌ఫోర్స్(ఎస్‌టీఎఫ్) టీం అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి గడిచిన 16 నెలల్లో 22 షాపులపై కేసులు నమోదు చేశారు. అందులో లూజ్ సేల్, మద్యంలో నీళ్లు కలపడం, ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తున్న వైన్స్‌లను సీజ్ చేశారు. ఇతర నిబంధనలు ఉల్లంఘించిన షాపులకు జరిమానా విధించారు.

పలుచోట్ల మారని తీరు..

ఎక్సైజ్ అధికారులు దాడులతో దూకుడు పెంచినప్పటికీ రెండు జిల్లాల్లోని పలు షాపుల యజమానులు మాత్రం దందాను ఆపడం లేదు. ఇంకా యథేచ్ఛగా బెల్ట్‌షాపులకు మద్యాన్ని విక్రయిస్తున్నారు. ఈ నెల 19న కాటారంలోని ఓ వైన్స్‌లో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని, అన్ని బ్రాండ్‌ల మద్యం అమ్మడం లేదని, బెల్టుషాపులకు సరఫరా చేస్తున్నారంటూ పలువురు ఆందోళన చేపట్టారు. టేకుమట్ల మండల కేంద్రంలోని ఓ వైన్స్‌లో అధిక ధరకు మద్యం విక్రయిస్తున్నారనే కారణంతో అధికారులు ఈ నెల 16న షాపును సీజ్ చేశారు. అయినప్పటికీ అక్కడ బెల్ట్ దందా ఆగడం లేదు. పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోనే పదుల సంఖ్యలో బెల్టుషాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. రేగొండలోని ఓ వైన్‌షాపును పూర్తిగా బెల్టుషాపులకే పరిమితం చేసినట్లు సమాచారం. ఆ షాపులో మందుబాబులకు మద్యం విక్రయించకుండా, ట్రాలీల్లో బెల్టుషాపులకు సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో కేసుల నమోదు వివరాలు..

తేదీ	వైన్స్ పేరు	చర్యలకు కారణం
ములుగు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో..		
30-12-2021	ఎస్ఎస్ వైన్స్	అధిక ధర
17-12-2021	శ్రీగంగ వైన్స్	అధిక ధర
21-07-2022	శ్రీలక్ష్మీనర్సింహ వైన్స్	సమయపాలన ఉల్లంఘన
23-12-2022	శ్రీరామ వైన్స్	అకౌంట్ రిజిస్టర్ రాయకపోవడం
ఏటూరునాగారం సర్కిల్ పరిధిలో..		
23-12-2021	భద్రకాళి వైన్స్	అధిక ధర
31-12-2021	బాలాజీ వైన్స్	అధిక ధర
31-12-2021	భవాని వైన్స్	అకౌంట్ రిజిస్టర్ రాయకపోవడం
24-03-2022	ఈఎన్ఆర్ వైన్స్	స్టాక్‌లో హెచ్చుతగ్గులు
24-03-2022	మహేష్ వైన్స్	స్టాక్‌లో హెచ్చుతగ్గులు
07-06-2022	లక్ష్మీనర్సింహ వైన్స్	సమయపాలన ఉల్లంఘన
23-06-2022	లక్ష్మీనర్సింహ వైన్స్	అధిక ధర
04-02-2023	లక్ష్మీనర్సింహ వైన్స్	అకౌంట్ రిజిస్టర్ రాయకపోవడం
భూపాలపల్లి సర్కిల్ పరిధిలో..		
29-12-2021	కల్యాణి వైన్స్	అధిక ధర
02-02-2023	కల్యాణి వైన్స్	ఆర్ 2 రిజిస్టర్ రాయకపోవడం
15-02-2023	రాజరాజేశ్వర వైన్స్	ఆర్ 1 రిజిస్టర్ రాయకపోవడం
02-02-2023	తెలంగాణ వైన్స్	మద్యంలో నీళ్లు కలపడం
16-03-2023	లక్ష్మీనర్సింహ వైన్స్	అధిక ధర
కాటారం సర్కిల్ పరిధిలో..		
14-12-2021	శ్రీనివాస వైన్స్	అధిక ధర
22-03-2022	శ్రీ కాళేశ్వరముక్తీశ్వర	ఇతర షాపులోని మద్యం కలిగి ఉండటం
04-02-2023	పద్మావతి వైన్స్	ఆర్ 1 రిజిస్టర్ రాయకపోవడం
02-02-2023	శ్రీనివాస వైన్స్	ఆర్ 2 రిజిస్టర్ రాయకపోవడం
02-02-2023	నాగులమ్మ వైన్స్	ఆర్ 2 రిజిస్టర్ రాయకపోవడం

చర్యలు తప్పవు..
రెండు జిల్లాల్లో నిత్యం దాడులు నిర్వహిస్తున్నాం. ఇప్పటికే చాలా షాపులపై కేసులు నమోదు చేశాం. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవు.
- శ్రీనివాస్, ఎక్సైజ్ సూపరింటెండెంట్

మెరుగైన వైద్యసేవలు అందించాలి



దయాలసిస్ రోగులతో మాట్లాడుతున్న పీఓ



న్యూట్రిషన్ కిట్లను బాలింతలకు అందజేస్తూ..

ఐటీడీఏ పీఓ అంకిత్

ఏటూరునాగారం: సామాజిక ఆస్పత్రికి వస్తున్న గర్భిణులు, ఇతర రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రిని ఆయన జిల్లా వైద్యాధికారి అప్పయ్యతో కలిసి ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం కొత్తగా నిర్మించిన మాతా, శిశు ఆరోగ్య భవనంలో డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. మిషనరీలు, మెడిసిన్, ఇతర పరికరాలు, సర్జికల్స్ నిల్వ చేసుకోవాలన్నారు. భవనంలో కావాల్సిన పరికరాలు లేవని, వాటి వివరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ సురేష్‌కుమార్ పీఓకు వివరించారు. ములుగు వెలుగు యాప్‌లో వైద్యులు, సిబ్బంది హాజరు వేయాలని, వేయకపోతే చర్యలుంటాయన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పనిచేస్తున్న వైద్యులతో పీఓ సమావేశమయ్యారు. స్పెషలిస్ట్ వైద్యులు సమయానికి క్రమం తప్పకుండా విధులకు హాజరు కావాలన్నారు. స్పెషలిస్ట్ డాక్టర్లు సాధారణ కాన్పులు అయ్యే విధంగా చూడాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని గిరిజన బాలికల జూనియర్ కళాశాలను పీఓ తనిఖీ చేశారు. లెక్చరర్లు, సిబ్బంది, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షల్లో ఉత్తీర్ణశాతం రావాలన్నారు. వార్డెన్లు రాత్రి సమయాల్లో పర్యవేక్షణ చేయాలన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో క్రీడా పోటీలు ఉన్నాయని, వేసవిలో బ్రిడ్జ్ కోర్సు క్యాంపులకు ప్లాన్ చేస్తున్నామని పీఓ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రవీణ్‌చందర్, దిలీప్, పృధ్విరాజ్, అనిల్ పాల్గొన్నారు.

రక్తహీనత నిర్మూలనకు న్యూట్రిషన్ కిట్లు

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనత నిర్మూలన కోసమే ఐటీడీఏ ద్వారా ప్రత్యేక న్యూట్రిషన్ కిట్లు అందిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ అంకిత్ తెలిపారు. మండల కేంద్రంలోని నేతాజీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ పక్షంలో భాగంగా న్యూట్రిషన్ కిట్లను బాలింతలకు పీఓ అందజేశారు. అనంతరం పీఓ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే చిరుధాన్యాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఈ ఏడాది మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించినట్లు తెలిపారు. ఐటీడీఏ ద్వారా బాలింతలకు ఇప్పపువ్వు లడ్డు, పల్లి, నువ్వులపట్టి, జోహర్ స్వీట్ మిల్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ హేమలత, పీహెచ్‌ఓ రమణ, సూపర్‌వైజర్ మనోరమ, వసంత, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధి పనుల పరిశీలన

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని సింగరేణి వర్క్‌షాపు సమీపంలోని బ్యారక్‌లలో చేపడుతున్న గ్రంథాలయ అభివృద్ధి పనులను మంగళవారం ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు పరిశీలించారు. బ్యారక్‌లలో చేపడుతున్న మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎస్టీ అసోసియేషన్ కార్యాలయ పనులను కూడా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సత్యనారాయణ, రామకృష్ణ, తుకారం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్, ఎస్టీ అసోసియేషన్ సభ్యులు మోహన్, హేమనాయక్‌లు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జీఎం

చూడి పశువుల పోషణలో మెళకువలు పాటించాలి

ములుగు రూరల్: చూడి పశువుల పోషణలో పెంపకందారులు మెళకువలు పాటించాలని కేవీకే.శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న సూచించారు. మండల పరిధిలోని మల్లంపల్లిలో పీవీ నర్సింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం, మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం, జాతీయ మాంసాభివృద్ధి సంస్థ హైదరాబాద్, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కిసాన్ మేళా మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అదనపు కలెక్టర్ వైవీ.గణేష్, డాక్టర్ షేక్ మీరా, సంచాలకులు అటారిలు హాజరై కిసాన్ మేళాను ప్రారంభించారు. ముందుగా స్వచ్ఛమైన పాల ఉత్పత్తిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరదీపికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాకారంలో పశువులకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు నిర్వహించామన్నారు. పశు పోషణలో ఆధునిక పద్ధతులను పాటించాలని సూచించారు. మహిళా రైతులు పెరటి కోళ్ల పెంపకంతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ప్రకృతి, సేంద్రియ వ్యవసాయం పట్ల శ్రద్ధ చూపాలన్నారు. జిల్లాలో కేవీకే ద్వారా జగ్గన్నపేట, పులిగుండం, పొట్లాపూర్, బండారుపల్లి గ్రామాల్లో సుమారు 4,500 కోళ్లను పంపిణీ చేశామని వివరించారు. జిల్లాలో పశుపోషణ, చేపల పెంపకానికి అనువుగా ఉంటుందని తెలిపారు. కిసాన్ మేళా ప్రదర్శనలో రాజశ్రీ కోళ్లు, నెల్లూరు గొర్రె పొట్టేలు, వివిధ రకాల పశుగ్రాసం రైతులను ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో జాతీయ మాంసాభివృద్ధి సంచాలకులు బార్ బుద్దే, డాక్టర్ బసవరెడ్డి, సర్పంచ్ చందా కుమార్, శాస్త్రవేత్తలు అరుణజ్యోతి, సౌమ్య, హనుమంతరావు, సహాయ సంచాలకులు కరుణాకర్, రవీందర్, వెంకటేశ్, జిల్లా పశు వైద్యాధికారి విజయభాస్కర్, శ్రీధర్, నవత, రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు

ఏటూరునాగారం: గుండెపోటు వచ్చిన వారిని సీపీఆర్‌తో ప్రాణాలను కాపాడవచ్చని జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ఈజీఎస్ సిబ్బందికి సీపీఆర్‌పై మంగళవారం ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ మంకిడి వెంకటేశ్వర్లు, డాక్టర్ ఛాముండేశ్వరి శిక్షణ ఇచ్చారు. అనంతరం సీఈఓకు సీపీఆర్ చేసే విధానంపై డాక్టర్లు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీపీఆర్ విధానంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గుండెపోటు వచ్చిన వారికి సకాలంలో సీపీఆర్ చేసి వారి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. అనంతరం జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు వలియాబీ, ఎంపీపీ అంతటి విజయ, వైఎస్ ఎంపీపీ తుమ్మ సంజీవరెడ్డి, ఎంపీటీసీ కోట నర్సింహులు మాట్లాడారు. గుండెపోటుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో కూడా సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు దొడ్డ కృష్ణ, చింత రేణు, పలక చిన్నన్న, వైద్యులు సుచరిత, చంద్రశేఖర్, మాధవి, ఎంపీడీఓ కుమార్, సీహెచ్‌ఓ శారద, హెల్త్ సూపర్‌వైజర్ కమల, స్టాఫ్ నర్సు ఝాన్సీలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



సీపీఆర్ చేసి చూపిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి



విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ

మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేయాలి

గ్రామాల్లో నూటికి నూరుశాతం మరుగుదొడ్ల నిర్మాణం పనులు పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎస్‌బీఎంపై రెండో రోజు శిక్షణ, శివాపురంలో గ్రామ సర్వే మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న మరుగుదొడ్లను పూర్తి చేయాలన్నారు. కొత్తగా నిర్మించుకుంటే మంజూరు ఇస్తామన్నారు. అసంపూర్తి నిర్మాణాలు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని ఈజీఎస్ సిబ్బందిని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కుమార్, ఎస్‌బీఎం జిల్లా కోఆర్డినేటర్ మైమున్నీసా, ట్రైనర్ రహిమొద్దీన్, సర్పంచ్‌లు వంక దేవేందర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తీర్ణతశాతం పెరగాలి

పదో తరగతి పరీక్షల్లో కేజీబీవీ విద్యార్థుల ఉత్తీర్ణ శాతం పెరగాలని జెడ్పీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారిణి ప్రసూనరాణి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఏకాగ్రతతో చదివి పరీక్షల్లో 10/10 జీపీఏ సాధించాలన్నారు.


మినరల్ వాటర్ ధరలు తగ్గించాలి

ములుగు రూరల్(గోవిందరావుపేట): గోవిందరావుపేట మండలం పరిధిలోని పస్రాలో మినరల్ వాటర్ ధరలు తగ్గించాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినరల్ ప్లాంట్ యజమానులు వాటర్ క్యాన్ రేట్లను విపరీతంగా పెంచి సామాన్యుడికి అందుబాటులో లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ ఆధ్వర్యంలో విడుదల చేస్తున్న తాగునీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. కనీసం తాగునీటిని ప్రజలకు అందించని పంచాయతీని ఉత్తమ పంచాయతీగా ఎలా ఎంపిక చేశారని ప్రశ్నించారు. గతంలో పంచాయతీ అధికారులకు వినతిపత్రం అందించిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మినరల్ వాటర్ క్యాన్‌ను రూ. 2కు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకుడు గొంది రాజేష్, మంచాల కవిత, శారద, పద్మ, స్రవంతి, జీవన్, గణేష్, సీతారామరాజు, శ్రీను, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

గౌడ జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజుగౌడ్



ములుగు: ములుగు పట్టణానికి చెందిన ఓడ రాజు గౌడ్‌ను గౌడ జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు ముంజాల భిక్షపతి మంగళవారం ప్రకటించారు. గౌడన్నల అభ్యున్నతికి రాజకీయాలకు అతీతంగా సర్దార్ సర్వాయి పాపన్న ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు.

పత్తి నిల్వలపై అప్రమత్తం

వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని రైతులు పత్తి నిల్వలపై అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతికుమార్ సూచించారు. మండల కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం మంగళవారం ఏర్పాటు చేయగా ఆయన హాజరై పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులతో పాటు వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తికి సరైన మద్దతు ధర రాకపోవడంతో రైతులు ఇళ్లలోనే పత్తిని నిల్వ చేసుకోవడం వల్ల పత్తిలో పురుగులు ఉంటాయని తెలిపారు. వాటి వల్ల మనుషులకు దద్దుర్లు, దురద వంటి చర్మ సమస్యలు వస్తాయని తెలిపారు. వాటికి ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు. ఈ శిబిరంలో వైద్యులు చీర్ల శ్రీకాంత్, లోకప్రియ, పీహెచ్ఎన్ శోభ, ఏఎన్ఎంలు స్వప్న, కనకలక్ష్మి, ఆశ కార్యకర్తలు సరోజన, మాధవి, సౌజన్య, కవిత, సంపూర్ణ, శోభ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

కుష్ఠువ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

ఏటూరునాగారం: కుష్ఠువ్యాధి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డీపీఎంఓ వెంకటేశ్వచారి అన్నారు. జిల్లా వైద్యాధికారి అప్పయ్య, ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవీందర్ సూచనల మేరకు మంగళవారం తాడ్వాయి, ఏటూరునాగారంలోని రొయ్యూర్ సబ్‌సెంటర్ల వారీగా సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరచారి మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి వచ్చిన వైద్య బృందం శాంపిల్ సర్వే, అసెస్మెంట్ యూనిట్ కుష్ఠువ్యాధి కేసులపై ఆరా తీసి ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు, వచ్చే నెల 3నుంచి 23వ తేదీ వరకు జిల్లాలో కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 246 అనుమానిత కేసులను గుర్తించామన్నారు. ఎల్‌ఈపీ రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఓలు జోసెఫ్, సురేందర్, శ్రీనివాసరెడ్డి, తాడ్వాయి వైద్యాధికారి రణధీర్, డీపీఎంఓ సాంబయ్య, సంజీవరావు, వైద్యులు, సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆకులవారిఘణపురం సబ్‌సెంటర్‌లో సర్వే బృందం

నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులు

- ఏడీఏ, ఏఓలు పట్టింపులేని తనం
- శారద ఫర్టిలైజర్ ఎదుట రైతుల నిరసన

ఏటూరునాగారం: కొత్త రకం వరి వంగడాలు వచ్చాయని ఫర్టిలైజర్ యజమానులు చెప్పిన మాటలు నమ్మి రైతులు మోసపోయిన ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మంగళవారం రాత్రి మండల కేంద్రంలోని శారద ఫర్టిలైజర్ షాపు ఎదుట బాధితుల రైతులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు జాడి భోజారావు, కుమ్మరి నరేష్, కుమ్మరి మల్లేష్, జాడి హరిబాబులు మాట్లాడుతూ సిరి సూపర్ 64 పేరుతో వరి విత్తనాలను శారద ఫర్టిలైజర్, సాయి తేజ ఫర్టిలైజర్ల ద్వారా కొనుగోలు చేశామన్నారు. డిసెంబర్ యాసంగి సాగులో భాగంగా మండల వ్యాప్తంగా సుమారు 200ల ఎకరాల్లో ఈ రకం విత్తనాలతో పంటలను సాగు చేసినట్లు తెలిపారు. అనుకున్నంత ఎదుగుదల లేకపోవడంతో వివిధ రకాల పురుగు మందులను కూడా పిచికారీ చేశామని, అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో విత్తనాలు నకిలీవి అని నిర్ధారించుకున్నట్లు వివరించారు. ఈ విషయాన్ని సదరు విత్తన కంపెనీకి చెందిన మహేందర్‌రెడ్డిని నిలదీయగా, ఆ రకం విత్తనాలు ఫెయిల్ అయ్యాయని ఒప్పుకున్నాడని, తాను బాధ్యత వహిస్తానని చెప్పి మభ్యపెట్టినట్లు ఆరోపించారు. మూడు నెలలనుంచి ఫర్టిలైజర్లు, ప్రతినిధి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా స్పందన లేదన్నారు. తాము మోసపోయామని ఏడీఏ, ఏఓలకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలూ చేపట్టలేదని రైతులు వాపోయారు. నకిలీ విత్తనాలు, పురుగుమందుల విక్రయాల్లో వ్యవసాయ అధికారుల మద్దతు ఉండడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



శారద ఫర్టిలైజర్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

డిక్కీ నుంచి రూ.5 లక్షలు అపహరణ

కాజీపేట: ద్విచక్ర వాహనంలో ఉన్న రూ.5 లక్షల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుని వెళ్లినట్లు బాధితులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం .. పద్మ అరవింద న్యాయవాది వద్ద పని చేస్తున్న పూలరాజు, గుండు శ్రీనివాస్‌లు ఆఫీసు పని మీద వడ్డెపల్లి రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్దకు మంగళవారం చేరుకోగా.. బ్యాంకులో సర్వర్ బిజీగా ఉందని వెనక్కి వచ్చారు. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై ఇద్దరు ఇంటికి వెళ్లిపోయారు. కొద్దిసేపటి తర్వాత స్కూటీ డిక్కీలో చూడగా.. రూ.5లక్షల నగదు కనిపించకపోవడంతో కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా.. పోలీసులు విభిన్న కోణాల్లో విచారణ జరుపుతున్నారు. నగదుతో రాజు, శ్రీనివాసులు తిరిగిన ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. న్యాయవాది వద్ద పని చేసే సిబ్బందికి పత్యక్షంగా, పరోక్షంగా సంబంధాలు ఉన్నాయా? అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

@ స్వేచ్ఛాగానం



కొత్తగూడ: ఇన్నాళ్లు జూ పార్కులో సందర్శకుల కోసం బందీలుగా ఉన్న చుక్కల దుప్పులను జూ, ఫారెస్ట్ అధికారులు మంగళవారం అటవీ ప్రాంతంలో వదిలారు. హైదరాబాద్ జూలో ఉన్న ఐదు ఆడ, ఐదు మగ చుక్కల దుప్పులను కొత్తగూడ మండలం ఓటాయి బీట్ పరిధిలో ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేసిన సోలార్ పంప్ వద్ద వదిలారు. అడవిలో దుప్పుల సంఖ్య పెరగడంతో జీవ వైవిధ్యం మెరుగు పడుతుందని డీఎఫ్ఓ రవికిరణ్ తెలిపారు. దుప్పుల రక్షణ కోసం ప్రత్యేక నిఘా విభాగం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

@ ప్రాణాపాయం



దుప్పితో అటవీ శాఖ అధికారులు



ఎస్ఎస్ తాడ్వాయి: అడవిలో స్వేచ్ఛగా గెంతుతున్న దుప్పి వేటగాళ్ల బాణానికి గాయపడింది. రేంజ్ అధికారి షౌకత్ హుస్సేన్ తెలిపిన వివరాల ప్రకారం.. రోజువారీ డ్యూటీలో భాగంగా మంగళవారం మేడారం బీట్ పరిధిలోని అడవి ప్రాంతంలో సెక్షన్, బీట్ ఆఫీసర్, వాచర్ అడవిలో విధులు నిర్వర్తిస్తుండగా.. పరుగెడుతూ కింద పడిన చుక్కల దుప్పిని పరిశీలించగా.. శరీరంలో బాణం గుచ్చుకొని ఉంది. వెంటనే అటవీ అధికారులు దుప్పిని తాడ్వాయి పశువైద్యశాలకు తీసుకెళ్లి బాణాన్ని తొలగించి చికిత్స అందించారు.

@ 'డెవిల్ ఫిష్' లభ్యం

- జాలర్ల వలకు చిక్కిన 38కేజీల బరువున్న అరుదైన చేప



కాళేశ్వరం: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ పరిధిలోని ప్రాణహిత నదీ పరీవాహక ప్రాంతంలో జాలర్ల వలకు మంగళవారం 38కేజీల బరువున్న అరుదైన డెవిల్‌ఫిష్ చిక్కింది. ఈ చేపను సిరొంచ ప్రాంతంలో బోధ్ అని కూడా అంటారని జాలర్లు పేర్కొన్నారు. అరుదుగా ఛత్తీస్‌గఢ్‌లో లభించే ఈ చేపలు సుమారుగా 50–70కిలోల వరకు బరువు ఉంటాయని, అధిక మాంసాహారం తింటుందని, ప్రొటీన్లు కూడా అధికంగా ఉంటాయని జాలర్లు తెలిపారు.

ఉంగరం పోయిందని.. ఉసురు తీసుకుంది



హేమలతరెడ్డి (ఫైల్)

దంతాలపల్లి: ఉంగరం పోయిందని మండలంలోని గున్నెపల్లి గ్రామానికి చెందిన మద్దుల హేమలతరెడ్డి(19) మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హేమలతరెడ్డి హనుమకొండలోని ఓ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఉగాది పండుగ కోసం ఇటీవల ఇంటికి వచ్చిన హేమలతరెడ్డి చేతి ఉంగరం పోయింది. దీంతో మనస్తాపానికి గురైన సదరు యువతి ఇంట్లో వాళ్లు ఏమైనా అంటారనే భయంతో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో సూసైడ్ లెటర్ రాసి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి మద్దుల జానకీరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కూచిపూడి జగదీశ్ తెలిపారు.

గీత కార్మికుడిని కాపాడిన గ్రామస్తులు



జేసీబీ సాయంతో సోమన్నను కాపాడిన గ్రామస్తులు

కొడకండ్ల: మండలంలోని రామవరం గ్రామానికి చెందిన గీత కార్మికుడు కారు పోతుల సోమన్న సోమవారం సాయంత్రం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కుతుండగా ఆకస్మాత్తుగా బలంగా ఈదురు గాలి వీచింది. దీంతో మోకు జారి తల కిందకు అయింది. చెట్టుకు వేలాడుతూ ప్రాణాపాయంలో ఉన్న సోమన్న పరిస్థితిని గమనించిన తోటి గీత కార్మికుడు బాల్నె కుమార్ చెట్టు ఎక్కి గ్రామస్తుల సహకారంతో సోమన్నను తాళ్లతో కట్టి కిందకు దించేందుకు యత్నించాడు. గ్రామస్తులు పక్కనే పనులు నిర్వహిస్తున్న జేసీబీని తీసుకొచ్చి ముందు డబ్బాలో ఇద్దరు కూర్చుని చెట్టుపైకి వెళ్లి వేలాడుతున్న సోమన్నను సురక్షితంగా కిందకు దించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించిన గ్రామస్తులు గీతకార్మికుడి ప్రాణాల్ని కాపాడారు.

రాత్రంతా రిజిస్ట్రార్ చాంబర్‌లో నిరసన

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో 2010లో నియామకమైన అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమకు వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మధ్యాహ్నం వరకు రిజిస్ట్రార్ చాంబర్‌లోనే బైఠాయించి నిరసన తెలిపారు. సోమవారం సాయంత్రం రిజిస్ట్రార్ చాంబర్‌లో బైఠాయించిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు రాత్రి మొత్తం అక్కడే ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం వరకు నిరసన కొనసాగింది. సెనేట్ సమావేశం ముగిశాక పాలకమండలి సభ్యులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. అంతకుముందు పాలక మండలి సభ్యుడు టి.మనోహర్ సెనేట్ సమావేశంలో ఉండగా.. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసన విషయం తెలిసి ఆయా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు వేతనాలు చెల్లించాల వీసీని కోరారు. దీనిపై వీసీ రమేశ్ స్పందిస్తూ వీరి నియామకం వివాదాస్పదమైందని, తన చేతిలో ఏమీ లేదని తెలిపారు. వీరి వేతనాల విషయంలోనే తనపై కేసు నమోదైందని వాపోయారు. కాగా, అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యను అకాడమిక్ సెనేట్‌లో చర్చించడం సరికాదని, పాలకమండలి సమావేశంలో చర్చించుకోవాల్సి ఉంటుందని కేయూ మాజీ వీసీ గోపాల్‌రెడ్డి తెలిపారు.

ఏనుమాములలో వారిదే హవా!



వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 14వ డివిజన్ ఏనుమాముల ప్రాంతంలో దశాబ్దాల క్రితం కొన్న ప్లాట్లు పెద్ద సంఖ్యలో ఉండడంతో రెండు, మూడు గ్యాంగ్‌లుగా ఏర్పడి కొందరు కబ్జాలకు తెరలేపారు. ఓ గ్యాంగ్‌కు రాజకీయంగా పలుకుబడి ఉన్న వారి ఆశీస్సులు ఉండగా.. మిగిలిన గ్యాంగులకు రాజకీయ, సామాజిక ఉద్యమాలకు చెందిన వారు నేపథ్యం వహిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం కాని సమయంలోని ఏనుమాముల గ్రామ పంచాయతీ పరిధిలో సుందరయ్యనగర్, బాలాజీనగర్, మణికంఠకాలనీ, మధురానగర్, లక్ష్మీగణపతి కాలనీ, సాయి గణేశ్‌నగర్, ఎస్ఆర్‌నగర్, గాంధీనగర్, ప్రతాప రుద్ర కాలనీ, ముసలమ్మకుంట, చాకలి ఐలమ్మ నగర్ తదితర ప్రాంతాల్లో వందల ఎకరాలను ప్లాట్లు చేసి విక్రయించారు.

- ఖాళీ జాగా కనిపిస్తే కబ్జా
- పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేసినా పట్టింపు శూన్యం
- సీపీ దృష్టికి వెళ్లడంతో టాస్క్‌ఫోర్స్ రంగ ప్రవేశం
- అదుపులో కార్పొరేటర్ భర్త, మరో నలుగురు నేతలు
- పరిశీలనలో మరికొంత మంది నేతల జాబితా

వరంగల్ నగరానికి అతి సమీపంలో ఉన్నప్పటికీ లేఔట్ తదితర ఆంక్షలు లేక పోవడం, తక్కువ ధరలకు ప్లాట్లు లభిస్తుండడం, భవనాలు నిర్మించుకుంటే అనుమతులు సులభంగా వస్తుండడంతో వందలాది మంది ప్లాట్లను కొనుగోలు చేశారు. 200 గజాల ప్లాటు కేవలం రూ.లక్ష నుంచి రూ.2 లక్షల లోపు రావడంతో మధ్యతరగతికి చెందిన వారు ఎక్కువ మంది కొన్నారు. ఆర్థికంగా ఉన్న వారు అప్పుడు తాత్కాలికంగా ఇల్లు, షెడ్లు, ప్రహరీలు నిర్మించుకుని గ్రామ పంచాయతీ నుంచి ఇంటి నంబర్లు పొందడంతో వారు కబ్జా రాయుళ్ల నుంచి తప్పించుకున్నారు. భవిష్యత్‌లో తమ పిల్లల అవసరాలు, పెళ్లిళ్లకు అక్కరకు వస్తాయని కొనుగోలు చేసిన వారు మాత్రం ప్రస్తుతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్‌లో ఏనుమాముల గ్రామ పంచాయతీ విలీనం అవుతుందని తెలిసిన వారు చాలా మంది ముందస్తుగా ఇంటి నంబర్లు పొందారు. కొంత మంది కొన్నప్పటికీ స్థానికంగా లేక పోవడం వల్ల రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమి కదా.. అనే ధీమాతో ఉన్న వారు ఇప్పుడు అష్టకష్టాలు పడుతున్నారు.

పోలీస్‌స్టేషన్ల చుట్టూ ప్రదక్షిణలు

తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ధరణి పోర్టల్‌లో కాస్తు కాలంలో సైతం పట్టాదారుడి పేరు రావడంతో కబ్జా రాయుళ్ల పంట పండుతోంది. అప్పటి పట్టాదారులకు చెందిన వారసుల (హక్కుదారుల)తో ఇప్పుడు రిజిస్ట్రేషన్లు చేయించుకొని ప్లాట్లను అక్రమించుకునే పనిలో పడ్డారు. దీంతో బాధితులు తమ ప్లాట్లను ఆక్రమించుకుంటున్నారని పోలీస్‌స్టేషన్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా.. రాజకీయ నేతల ఒత్తిళ్లతో పోలీసులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో పడిపోయినట్లుగా తెలుస్తోంది. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా ఏవీ.రంగనాథ్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన వెంటనే భూకబ్జాదారులు, అక్రమణల గ్యాంగ్‌లపై దృష్టి పెట్టడంతో బాధితులు కమిషనర్ కార్యాలయం దారి పట్టారు. భూకబ్జాలు, అక్రమణల వల్ల ప్రభుత్వానికి సైతం అపవాదు వస్తున్నందున అధికార యంత్రాంగం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. అందులో భాగంగానే అధికార పార్టీకి చెందిన వారైనప్పటికీ ఆక్రమణ, కబ్జాలకు పాల్పడితే చర్యలు తీసుకున్నట్లుగా సమాచారం.

కబ్జాదారులకు ఫైనాన్షియర్ల అండ

ఏనుమాముల, కోటిలింగాల గుడి ప్రాంతాల్లో కబ్జాలకు పాల్పడే గ్యాంగులకు కాశిబుగ్గకు చెందిన ఇద్దరు, ముగ్గురు ఫైనాన్సియర్లు ఆర్థికంగా సహాయం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సుమారు రూ.కోటి విలువగల ప్లాట్లకు రూ.5 నుంచి రూ.10 లక్షలు పెట్టుబడి పెడితే వచ్చిన మొత్తంలో సగం ఫైనాన్సర్లు తీసుకుంటున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. ప్లాట్ దక్కని పరిస్థితుల్లో సైతం పెట్టిన పెట్టుబడి గుడ్‌విల్ కింద వస్తేనే వదిలివేస్తున్నట్లుగా తెలిసింది. ఇందులో ఒక ఫైనాన్సర్ వివాదాస్పద భూములు కొనేందుకు మాత్రమే పెట్టుబడి పెడుతున్నట్లుగా తెలిసింది.

టాస్క్‌ఫోర్స్ అదుపులో ఐదుగురు, రాత్రి విడుదల

- కార్పొరేటర్ భర్తతో సహా నలుగురు నేతలు



కాశిబుగ్గ కార్పొరేషన్ సర్కిల్ కార్యాలయం ముందు పోలీసు వాహనాలు

ఏనుమాముల ప్రాంతంలో పలు భూ వివాదాల్లో జోక్యం ఉన్నట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో 14వ డివిజన్ అధికార పార్టీ కార్పొరేటర్ తూర్పాటి సులోచన భర్త మాజీ జెడ్పీటీసీ తూర్పాటి సారయ్య, బాలాజీనగర్‌కు చెందిన మాజీ కారోబార్ తూర్పాటి రఘు, తూర్పాటి శ్రీను, సుందరయ్యనగర్‌కు చెందిన జంగం రాజు, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి గంద్రతి భాస్కర్‌లను మంగళవారం ఉదయం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దేశాయిపేటతోపాటు 14వ డివిజన్‌లోని బాలాజీనగర్, మధురానగర్, కోటిలింగాల దేవాలయం, మణికంఠకాలనీల్లోని స్థలాలను ఆక్రమించుకొని సంబంధిత యాజమానులను బెదిరింపులకు పాల్పడినట్లుగా వీరందరిపై ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌లో పలు ఫిర్యాదులు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఏనుమాముల గ్రామ పంచాయతీలో ఉద్యోగిగా పని చేసిన ఓ వ్యక్తి పోస్టుకు రాజీనామా చేసి బంధువులైన అధికార పార్టీ నేత, నాయకులతో కలిసి భూదందాలపై పడినట్లుగా తెలిసింది. ఈ వ్యవహారం వర్ధన్నపేట ఎమ్మెల్యే దృష్టికి రావడంతో సదరు నేతను భూ వివాదాల్లో జోక్యం చేసుకోవద్దని బహిరంగంగా హెచ్చరించినట్లు తెలిసింది. దీనికి తోడు రాష్ట్రస్థాయి ముఖ్య నేతల భూముల్లోనూ జోక్యం చేసుకోవడం వల్లే టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. వీరి అరెస్ట్ విషయంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులను వివరణ కోరగా విచారణ కోసం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం రాత్రి కాశిబుగ్గలోని గ్రేటర్ వరంగల్ సర్కిల్ కార్యాలయానికి మూడు పోలీసు వాహనాలు వచ్చాయి. కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో పోలీసులు భూ అక్రమణల ఆరోపణలపై క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. కాగా.. అదుపులోకి తీసుకున్న ఐదుగురిని రాత్రి పోలీసులు విడుదల చేశారు. అదేవిధంగా వరంగల్ తూర్పునకు చెందిన మరో నలుగురు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల పేర్లు ఆక్రమణలు పాల్పడే వారి జాబితాలో ఉన్నట్లుగా తెలిసింది. ఇప్పటికే ఆ స్థలాలను ఆక్రమించుకుని వారి అధికారంతో ప్రహరీలు, తాత్కాలిక షెడ్లను నిర్మించి ఇంటి నంబర్లు సైతం తీసుకున్నట్లు తెలిసింది.

విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం

- మంత్రి దయాకర్‌రావు



మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 50 రోజులుగా ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు కొనసాగుతున్న పదో తరగతి వార్షిక పరీక్షల అధ్యయన శిబిరం మంగళవారం డివిజన్ కేంద్రంలోని నితిన్ భవన్‌లో ముగిసింది. ఈసందర్భంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రి దయాకర్‌రావు, జిల్లా కలెక్టర్ కె.శశాంక పాల్గొన్నారు. వీఎంఎఫ్ వ్యవస్థాపకులు తక్కెళ్లపల్లి రవీంద్ర అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదోతరగతి విద్యార్థులకు 50 రోజుల పాటు తొర్రూరులో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వసతి, భోజనంతో కూడిన వార్షిక పరీక్షల అధ్యయన శిబిరం నిర్వహించడం గర్వకారణమన్నారు. ఈ ఫౌండేషన్‌లో బాలికల వసతికై రూ.20 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకై విద్యార్థులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అభిలాష అభినవ్, ట్రైనీ కలెక్టర్ పింకేశ్‌కుమార్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ సంస్థ చైర్మన్ లక్ష్మారెడ్డి, డీఈఓ రామారావు, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, ఆర్డీఓ ఎల్.రమేశ్, మహాత్మ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకులు గంటా రవీందర్, డాక్టర్ రాజు పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్



మాట్లాడుతున్న ఏసీపీ, పక్కన సీఐ, ఎస్ఐ


జనగామ: జనగామలో ఆర్థిక లావాదేవీల విషయంలో జరిగిన గొడవలో ఓ మహిళను దారుణంగా హత్య చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపించినట్లు ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఎలబోయిన శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నర్మెట మండలం బొమ్మకూరుకు చెందిన మాలోతు విజయ, భర్త తిరుపతి మధ్య మనస్పర్థలు రావడంతో దూరంగా ఉంటున్నారు. దీంతో విజయ తన ముగ్గురు పిల్లలను తీసుకుని జనగామ పట్టణం గుండ్లగడ్డకు మకాం మార్చింది. కుటుంబ పోషణ కోసం హైదరాబాద్ లక్డీకపూల్ ఓఫంక్షన్ హాల్‌లో క్యాటరింగ్ పనికి కుదిరింది. ఈసమయంలో కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన లేబర్ కాంట్రాక్టర్ మాలోతు మోహన్‌రావుతో పరిచయం ఏర్పడింది. ఆయనతో సహజీవనం చేస్తూ వారిద్దరూ జనగామలో స్థిరపడ్డారు. ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవీల విషయంలో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈనెల 25న రాత్రి 9 గంటలకు మోహన్‌రావు ఆమెతో గొడవకు దిగాడు. ఈసమయంలో పక్కనే ఉన్న రోకలి బండ తీసుకుని తలపై బాదాడు. దీంతో తీవ్ర రక్తస్రావంతో ఆమె కుప్పకూలింది. విషయం తెలుసుకున్న కుమారుడు, అతడి స్నేహితులు విజయను జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా.. ఆమె అప్పటికే మృతి చెందింది. మృతురాలి కుమారుడు వెంకట్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఈక్రమంలో మంగళవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో ఎస్ఐలు రఘుపతి, శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తుండగా నిందితుడు మోహన్‌రావు పట్టుబడ్డాడు. పూర్తి సాక్ష్యాధారాలతో ఆయనను కోర్టులో రిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐ సృజన్, పీసీలు కె.అనిల్‌కుమార్, వి.కిరణ్ కుమార్, ఎస్.సాగర్, అనిత ఉన్నారు. కేసు ఛేదనలో కృషి చేసిన వారిని ఏసీపీ అభినందించారు.


నగల దొంగ అరెస్ట్

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని శివాలయం సమీపంలో నగల దొంగను పోలీసులు అరెస్టు చేశారు. వెంకటాపురం సీఐ శివప్రసాద్ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మంగళవారం ఉదయం ఎస్సై తిరుపతితో కలిసి పెట్రోలింగ్ నిర్వహించారు. అదే సమయంలో ఒక వ్యక్తి బ్యాగుతో అనుమానాస్పదంగా వస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించాడు. పారిపోతున్న వ్యక్తిని వెంబడించి పట్టుకుని విచారించారు. అతడిని ఏటూరునాగారం మండలం రామ్‌నగర్‌కు చెందిన కాలాల రవిగా గుర్తించారు. అతడు పలు దొంగతనాలు చేసినట్లుగా విచారణ తేలింది. అతడి వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా.. సుమారు రూ.ఏడు లక్షల విలువైన బంగారు ఆభరణాలు లభించాయి. రవిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆర్టీసీ బస్సు ఢీ.. ఒకరి మృతి

- నిలిచి ఉన్న వాహనాన్ని ఢీకొన్న బస్సు
- అక్కడికక్కడే ఒకరి మృతి.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు





శ్రీను (ఫైల్) శ్రీను మృతదేహం

రాయపర్తి: వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం శివారులో మిర్చి లోడుతో వెళ్తున్న ఓ మినీ గూడ్స్ టైర్ పంక్చరై రోడ్డు పక్కన నిలిపి ఉంచిన క్రమంలో వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈఘటనలో సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం మొగ్గయ్యగూడెం రోళ్లబండ తండాకు చెందిన ధరావత్ శ్రీను(46) అక్కడికక్కడే మృతి చెందాడు. రైతులు వెంకన్న, భీమాకు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీను వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అందులో భాగంగా 20 గుంటల్లో మిర్చి సాగు చేశాడు. మిర్చిని అమ్మేందుకు అతడి తమ్ముడు ధరవత్ భీమాకు చెందిన టాటా మినీ గూడ్స్‌లో మరో రైతు బానోతు వెంకన్నకు చెందిన మిర్చి బస్తాలను లోడ్ చేసుకొని మంగళవారం తెల్లవారుజామున వరంగల్ ఏనుమాముల మార్కెట్‌కు బయల్దేరారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం శివారులో మినీ గూడ్స్ పంక్చర్ అయింది. దీంతో వాహనాన్ని నిలిపి చూస్తుండగా.. ఖమ్మం నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తున్న లగ్జరీ బస్సు వేగంగా మినీ గూడ్స్‌ను వెనుకనుంచి ఢీకొట్టింది. ఈఘటనలో తలకు బలమైన గాయాలవడంతో శ్రీను అక్కడికక్కడే మృతిచెందాడు. రైతులు వెంకన్న, భీమాకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. అజాగ్రత్తగా నడిపి తన భర్త మృతికి కారణమైన ఆర్టీసీ డ్రైవర్ ఎ.భగవత్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య ధారవత్ బుజ్జి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్సై సదానందం తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు..



అశోక్(ఫైల్)

నెక్కొండ: గుర్తు తెలియని వాహనం ఢీకొని నెక్కొండకు చెందిన చొప్పరి అశోక్(28) మంగళవారం మృతి చెందాడు. అశోక్ రెండు నెలల నుంచి అప్పల్‌రావుపేటలోని అమ్మమ్మ భద్రమ్మ వద్ద ఉంటున్నాడు. గ్రామంలోని ఊర చెరువులో చేపలు తీసుకొచ్చేందుకు బైక్‌పై వెళ్లాడు. ఈక్రమంలో గుర్తు తెలియని వాహనం ఊర చెరువు కట్టపై ఢీకొంది. ఈ ఘటనలో అశోక్ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

కెన్యాలో ధర్మరావుపేట రైతు..



బ్రహ్మచారి(ఫైల్)

ఖానాపురం: మండలంలోని ధర్మరావుపేటకు చెందిన పడకంటి బ్రహ్మచారి(55) కెన్యాలో మృతి చెందాడు. బ్రహ్మచారి ఇరవై ఏళ్ల క్రితం కెన్యాలోని తాంజానియాలో స్థిరపడ్డాడు. అక్కడ సుమారు 25 ఎకరాల వ్యవసాయ భూమిలో పంటలు సాగు చేస్తున్నాడు. ఈక్రమంలో పంట చేను వద్ద చెట్లపై ఉన్న తేనెటీగలు దాడి చేశాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ అతడు మంగళవారం మృతి చెందాడు. బ్రహ్మచారి గ్రామాభివృద్ధికి తనవంతుగా తరచూ సహకారం అందించేవారని గ్రామస్తులు కేఎస్‌చారి, కోటి, వెన్ను పూర్ణచందర్, విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ బాధ్యులు తెలిపారు.

ఊపిరాపిన ఫ్యాన్!

- ఊడిపడి బాలిక మృతి



శ్రావణి (ఫైల్)

పెద్దవంగర: గాలినివ్వాల్సిన ఫ్యాన్ ఊడిపడి ఓ చిన్నారిని ఊపిరిని ఆపేసింది. హాయిగా నిద్ర పోయిన చిన్నారి.. తీవ్ర గాయాలై శాశ్వత లోకాలకు వెళ్లిపోయింది. నిద్రిస్తుండగా ఫ్యాన్ ఊడి పడి మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం రామచంద్రు తండాకు చెందిన జాటోతు యాకులు, లలిత దంపతుల మొదటి సంతానం శ్రావణి(9) మృతి చెందింది. శ్రావణి మూడో తరగతి చదువుతోంది. ఆదివారం రాత్రి ఇంట్లో కుటుంబీకులతో కలిసి నిద్రకు ఉపక్రమించింది. ఈక్రమంలో ప్రమాదవశాత్తు సీలింగ్ ఫ్యాన్ శ్రావణిపై పడింది. తీవ్ర గాయాలవడంతో తల్లిదండ్రులు తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు మెరుగైన చికిత్స కోసం ఖమ్మంకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రావణి మంగళవారం మృతి చెందింది. తొమ్మిదేళ్లకే నూరేళ్లు నిండాయా అని తల్లిదండ్రుల రోదించిన తీరు తండా వాసులను కంటతడి పెట్టించింది.

ప్రాణం తీసిన ఈత సరదా

- వాగులో మునిగి ఇద్దరు విద్యార్థులు మృతి
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఘటన



బండారి అఖిల్ (ఫైల్)



హర్షవర్ధన్ (ఫైల్)



ఆస్పత్రి వద్ద ఏడుస్తున్న తల్లిదండ్రులు

మొగుళ్లపల్లి: స్నేహితులతో కలిసి సరదాగా ఈతకు వెళ్లిన ఇద్దరు విద్యార్థులు వాగులో మునిగి చనిపోయారు. ఈ విషాద ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కొర్కిశాల వాగులో సోమవారం సాయంత్రం జరగగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. కొర్కిశాలలోని మోడల్‌స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న మొగుళ్లపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు, ఇస్సిపేట చెందిన ముగ్గురు, రంగాపురానికి చెందిన ఒకరు, లక్ష్మిపురానికి చెందిన ఒకరు మొత్తం ఏడుగురు విద్యార్థులు పాఠశాల కని బయల్దేరి మొగుళ్లపల్లి బస్టాండ్ కూడలిలో కలుసుకున్నారు. పాఠశాలకు వెళ్లకుండా కొర్కిశాల వాగుకు ఈతకు వెళ్లారు. వాగులో దిగి ఈత కొడుతుండగా మొగుళ్లపల్లి గ్రామానికి చెందిన బండారి కొమురయ్య-సమ్మక్కల రెండవ కుమారుడు అఖిల్ (14)తో పాటు రంగాపురం గ్రామానికి చెందిన వురుసుల కుమారస్వామి కావ్యల కుమారుడు హర్షవర్ధన్(14)లు లోతట్టు ప్రాంతానికి వెళ్లి గల్లంతయ్యారు. మిగతా విద్యార్థులు భయపడి విషయాన్ని గోప్యంగా ఉంచారు. రాత్రి వరకు అఖిల్, హర్షవర్ధన్లు ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై తోటి స్నేహితుల్లో ఒకరిని ఆరాతీయగా జరిగిన విషయం చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, స్థానికులు వాగులో గాలింపు చర్యలు చేపట్టగా అర్ధరాత్రి 1 గంటకు రంగాపురం గ్రామానికి చెందిన హర్షవర్ధన్ (14) మృతదేహం లభ్యమైంది. మంగళవారం ఉదయం 7 గంటలకు అఖిల్ (14) మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు. విద్యార్థులు మృతిపట్ల అనుమానం ఉందన్న తండ్రి వురుసుల కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. కాగా, పిల్లలందరూ ఈతకు వెళ్లేముందు కల్లు తాగినట్లు సమాచారం.

అన్నయ్య కావాలి...

రంగాపురం గ్రామానికి చెందిన మృతుడు హర్షవర్ధన్ చెల్లి హనీ 'నాకు అన్నయ్య కావాలి.అన్నయ్యతో మాట్లాడాలని, అన్నయ్యతో ఆడుకోవాలి'అంటూ ఏడుస్తుంటే బంధువులు, స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.